క్లుప్తంగా

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



డీపీఓ యాదగిరికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం గ్రామ పంచాయతీలో పనిచేస్తూ ఈనెల 8న ప్రమాదవశాత్తు మృతి చెందిన బుర్రా ఏడుకొండలు కుటుంబానికి రూ.10 లక్షల నష్ట పరిహారం, ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు గురువారం సూర్యాపేటలో డీపీఓ యాదగిరికి వినతిపత్రం అందించారు. ఆయన వెంట పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సైదానాయక్, దేవదానం, మైసయ్య, బాధితుని కుటుంబ సభ్యులు, తదితరులు ఉన్నారు.

రెడ్డి సేవాసమితి కమిటీ ఎన్నిక



జెట్టి వీరారెడ్డి, అధ్యక్షుడు



కరుణాకర్‌రెడ్డి, కార్యదర్శి

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో గురువారం రెడ్డి కులస్తులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సేవా సమితి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెట్టి వీరారెడ్డి, కార్యదర్శిగా అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బాల్నె శ్రీనివాసరెడ్డి, రెణబోతు వీరారెడ్డి, ఉప్పుల యాదగిరిరెడ్డి, సతీష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బోళ్ల రంగారెడ్డి, నారాయణరెడ్డి, రామనర్సిరెడ్డి, మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, వీరారెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశానికి గ్రామానికి చెందిన వంద మంది రెడ్డి కులస్తులు హాజరు కాగ బోళ్ల ప్రతాపరెడ్డి వందన సమర్పణ చేశారు.

ఎస్‌టీయూ మండల కమిటీ ఎన్నిక



సత్తూరి భిక్షం, అధ్యక్షుడు



గార్లపాటి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి

మునగాల : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) మండల శాఖ నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడిగా సత్తూరి భిక్షం, ప్రధాన కార్యదర్శిగా గార్లపాటి సుదర్శన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఎర్ర అంజన్‌రెడ్డి, జిల్లా శాఖ అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కంచుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల బోనాల రామిరెడ్డి దళిత కాలనీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.35 లక్షల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండేటి రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగారపు అరుణసైదులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలోని అన్ని వీధులను సీసీ రోడ్లుగా మార్చేందుకు కృషిచేస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య యాదవ్, వెంకటప్పయ్య, జహంగీర్, వెంకటరెడ్డి, వీరయ్య, కాటయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్ స్టేషన్ ఆవరణలో గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ చేపట్టారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాళ్ల నరేష్, సైదులు, రాజు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పనుల్లో వేగం

- రెడ్లకుంట లిఫ్ట్ పనుల్లో పురోగతి లేకపోవడంపై మంత్రి ఆగ్రహం
- అప్రోచ్ ఛానల్, పంప్ రూం పనుల్లో స్పీడ్ పెంచిన అధికారులు
- పథకం పూర్తయితే యాసంగిలో ఐదు వేల ఎకరాలకు సాగునీరు



అప్రోచ్ ఛానల్ పనులు చేపడుతున్న దృశ్యం

కోదాడరూరల్ : మండలంలో కొనసాగుతున్న రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనుల్లో వేగం పెంచారు. రెడ్లకుంట, నల్లబండగూడెం, దోరకుంట, కాపుగల్లు, కూచిపూడి గ్రామాల్లో ఐదు వేల ఎకరాలకు నీరందించానే లక్ష్యంతో ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నారు. గత ఏడాది మార్చిలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ నాటి నుంచి పలు కారణాలతో పనులు నత్తనడకన సాగాయి. ఈ ఏడాది జూలైలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఆ సమయంలో పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి వచ్చే యాసంగి పంటకు నీరు అందించేలా చూడాలని ఆదేశించాడు. దీంతో కాంట్రాక్టర్, అధికారులు పనులను ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఇన్‌టెక్ వెల్, అప్రోచ్ ఛానల్ పనులు జరగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే పైప్‌లైన్ వేయనున్నారు. అందుకు కావాల్సిన 700ల భారీ పైపులను తీసుకొచ్చారు.

రూ. 47.64 కోట్ల నిధులు..

సాగర్ ఆయకట్టులో ఆర్‌కే మేజర్ కాలువ చివరి గ్రామాలైన రెడ్లకుంట, నల్లబండగూడెం, దోరకుంట, కాపుగల్లు, కూచిపూడి గ్రామాల రైతుల భూములకు సాగు నీరు అందడం లేదు. దీంతో ఆయా గ్రామాల రైతుల కోరిక మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై రూ.47.64 కోట్ల నిధులతో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.

పూర్తి కావచ్చిన అప్రోచ్ ఛానల్ పనులు..

పాలేరు వాగుకు దగ్గరలో లిఫ్ట్ నిర్మిస్తే భారీ వరదలు వచ్చినపుడు మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని భావించి వాగుకు వంద మీటర్ల దూరం వరకు 4.8 మీటర్ల వెడల్పు 9 మీటర్ల లోతుతో వాగు నీరు వచ్చేలా అప్రోచ్ ఛానల్ (కాల్వ)ను నిర్మిస్తున్నారు. ఆ నీరు చేరే విధంగా 15 మీటర్ల వెడల్పు, 8 మీటర్ల పొడవు, 15 మీటర్ల లోతులో పంపు రూమ్ నిర్మాణం చేపడుతున్నారు. దానిలోకి నీరు వచ్చిన తర్వాత 450 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన నాలుగు మోటార్ల సహాయంతో 4.25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్‌కే మేజర్ కాల్వలో నీరు ఎత్తిపోసే విధంగా పంపు రూంను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. లిఫ్ట్ పూర్తయితే ఆయా గ్రామాల చివర భూములకు నీరందనుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పంపు రూం నిర్మాణానికి తవ్విన గుంత



రెడ్లకుంట వద్ద ఉంచిన పైపులు

బీడు భూములు సస్యశ్యామలం కానున్నాయి



రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణంతో మా గ్రామంతో పాటు నల్లబండగూడెం, దోరకుంట, కాపుగల్లు, కూచిపూడి గ్రామాల ఆర్‌కే మేజర్ చివరి భూములతో పాటు వందల ఎకరాల బీడు మూములు సస్యశ్యామలం కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఎత్తిపోతల నిర్మాణం కోసం పోరాటం చేశాం. లిఫ్ట్ మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి మా గ్రామాల రైతులం రుణపడి ఉంటాం.

– సాధినేని అప్పారావు, రెడ్లకుంట

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మఠంపల్లి : ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ కోరారు. గురువారం మఠంపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు మళ్లించడం తక్షణమే ఆపాలని అన్నారు. ప్రైవేటు కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లు తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని, జీఓ నంబర్ 12ను సవరించి బోర్డు ద్వారానే కార్మికులకు నేరుగా సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగుల్ మీరా, ప్రధాన కార్యదర్శిగా నాగలక్ష్మి, కోశాధికారిగా నాగరాజుతో పాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రన్‌మియా, బాలాజీనాయక్, కొమ్రరాజు, నెహ్రూ, లక్‌పతి, సక్రూ, శంకర్, పద్మ, లలిత, సరిత, స్వామి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సోమయ్యగౌడ్

దోమల నివారణకు ఫాగింగ్

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో దోమల నివారణకు గురువారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. అంతకు ముందు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్, బాలికల ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మోహన్‌బాబు, హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కోదాడరూరల్ : విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ఉండాలని ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని తొగర్రాయిలో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ తీసి కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాండురంగన్న, హౌసింగ్ ఏఈ జేఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి అవినాష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



గెల్లి అప్పారావు, అరుణ చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న చల్ల శ్రీలత, తదితరులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల ఆకస్మికంగా మరణించిన వారి కుటుంబాలను బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా గెల్లి అప్పారావు, అరుణ, దొంతిరెడ్డి రాంరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులైన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గెల్లి అర్చన, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గెల్లి రవి, బీఆర్ఎస్ నాయకురాలు దొంతిరెడ్డి పద్మను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొండా హరీష్, నాయకులు ఉమా మహేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, టి.నరేందర్‌రెడ్డి, డి.రామారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ టోర్నమెంట్‌కు విద్యార్థి ఎంపిక

హుజూర్‌నగర్ : పట్టణంలోని వీవీఎం స్కూల్ పదవ తరగతి విద్యార్థి భూక్యా వెంకట్ ఉమ్మడి నల్గొండ కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం అనిత, పీఈటీ శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోతె మండలం నామవరంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో డివిజన్ కెప్టెన్‌గా మంచి ప్రతిభ చాటి ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఉపాధ్యాయులతో కలిసి వారు అభినందించారు.

• అల్లుకున్న నిర్లక్ష్యం!

కోదాడ : పట్టణంలోని పలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్తంభాలను పిచ్చిమొక్కల తీగలు అల్లుకుపోయాయి. దీంతో ఏదైన ప్రమాదం సంభవిస్తుందేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



నయానగర్‌లో స్తంభానికి అల్లుకున్న తీగలు



కోదాడ ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ వద్ద..



పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియం వెనుక భాగంలో..

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

నడిగూడెం : వరంగల్ నగరంలో ఈ నెల 19, 20, 21 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రైతు సంఘం శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఏనుగుల వీరాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ తరగతులలో జాతీయ నాయకులు, శాస్త్రవేత్తలు, మేధావులు పాల్గొననున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారాలు ఇంకా పలు అంశాలపై చర్చలు జరగనున్నట్లు ఆయన తెలిపారు.

కేవైసీ అప్‌డేట్ తప్పనిసరి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగప్రసాద్

మునగాల : బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగప్రసాద్ కోరారు. గురువారం మండలంలోని నర్సింహాపురంలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజలు, బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్‌పెన్షన్ యోజన పథకాలను కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆకుపాముల ఎస్‌బీఐ మేనేజర్ మధుసూదన్, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, ఉదయ్, కోటేశ్వరరావు, గ్రామప్రజలు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



నేరేడుచర్ల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్



గరిడేపల్లి : ఎల్బీనగర్‌లో..

గరిడేపల్లి : మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ సరోజ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య మహిళ– శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ జీవనశైలి మార్చుకోవాలని సూచించారు. అనంతరం మండల వైద్యాధికారి నరేష్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వ్యాయామం, నడక, యోగా చేయాలన్నారు. ఆహారంలో ఉప్పు, నూనెల పరిమాణాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఆరోగ్య మహిళ– శక్తివంతమైన కుటుంబం కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అంజయ్య, వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు కవిత, విజయ, ఆశా కార్యకర్తలు భవాని, వెంకటమ్మ, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆరోగ్య మహిళ– శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా 56 మంది మహిళలకు వైద్యాధికారిని డాక్టర్ నాగిని వైద్య పరీక్షలు నిర్వహించారు. చిన్న పిల్లలకు డాక్టర్ నరేష్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సల్వాది శ్రీనివాస్, సూపర్‌వైజర్ ధనమ్మ, వెంకటేశ్వర్లు, డీఈఓ జ్యోతి, ఏఎన్‌ఎం రేణుక ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

మునగాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ వి.సరిత.. బూత్ లెవల్ ఆఫీసర్స్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ల జాబితా రివిజన్‌తో పాటు ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు తొలగించాలని, 18 సంవత్సరాలు నిండిన వారి వివరాలు సేకరించాలని బీఎల్‌ఓలను తహసీల్దార్ ఆదేశించారు. జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సీనియర్ సహాయకులు స్వప్న, మండల ఆర్ఐలు ఎస్.రామారావు, మంజుల, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, బీఎల్‌ఓలు

చేతులు తడిపితేనే ఆన్‌లైన్‌లో ఎంట్రీ!

చిలుకూరు : చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. లంచం ఇస్తేనే కుల, ఆదాయ, కుటుంబ, తదితర ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి తహసీల్దార్ డిజిటల్ సంతకాన్ని కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్‌ఐ ధ్రువీకరించి, తహసీల్దార్ సంతకం చేసినా ఫైల్స్ పెండింగ్‌లోనే పెడుతున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా కొంత నగదు ముట్టజెప్పాల్సిందేనని వాపోతున్నారు. చిలుకూరు మాజీ ఎంపీపీకి కూడా ఇదే పరిస్థితి ఎదురైనట్లు తెలిసింది. ఇటీవల పలు ధ్రువీకరణ పత్రాల కోసం వెళ్లిన చెన్నారిగూడెం గ్రామానికి చెందిన మరో ఇద్దరి వద్ద, బుధవారం ఓబీసీ సర్టిఫికెట్ జారీ కోసం ఓ వ్యక్తి లంచం తీసుకున్నట్లు దరఖాస్తుదారులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఏ ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నా కనీసం రూ.500 నుంచి రూ. 2000 వరకు డిమాండ్ చేస్తున్నట్లు దరఖాస్తుదారులు చెబుతున్నారు. ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకొని వచ్చి ఆ ఆన్‌లైన్ నంబర్ చెప్పి లంచంగా రూ. 500 ఇస్తే ఆర్‌ఐ, తహసీల్దార్, సిబ్బంది సంతకాలు లేకుండానే కార్యాలయంలో పనిచేసే సిబ్బంది నేరుగా పత్రాలు జారీ చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అయితే కార్యాలయంలోని ఓ అధికారి అండదండలతోనే వసూళ్లకు పాల్పడుతున్నాడని సమాచారం. కాగా, ఈ విషయంపై తహసీల్దార్ ధృవకుమార్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, సిబ్బందికి లంచం ఇచ్చిన వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యాభివృద్ధికి సహకారం అభినందనీయం

- బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్



విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న డీసీపీ కొల్లు సురేష్

నడిగూడెం : విద్యాభివృద్ధికి బత్తినేని సోదరుల సహకారం అభినందనీయమని బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్ అన్నారు. గురువారం మండలంలోని తెల్లబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఖమ్మం పట్టణానికి చెందిన బత్తిని రాకేష్, ప్రకాష్ సహకారంతో స్కూల్ బ్యాగులు, టీ షర్టులు, గొడుగులు పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, నాడు తన గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగానన్నారు. కావున మన గ్రామ విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం సంగారెడ్డి జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన కొల్లు నాగలక్ష్మి మాట్లాడుతూ.. 10వ తరగతిలో టాపర్‌గా నిలిచే విద్యార్థికి రూ.ఐదు వేల నగదు బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. అనంతరం దాతలను అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.ఉపేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, మాజీ సర్పంచ్ దేవబత్తిని వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



కందిబండలో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మేళ్లచెరువు : మండలంలోని కందిబండలో గురువారం యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. కందిబండ పీఏసీఎస్ వద్ద గురువారం యూరియా బస్తాలు ఇస్తున్నారని సమాచారంతో అక్కడకు చేరుకున్న రైతులు బారులుదీరారు. గంటలకొద్దీ నిరీక్షించారు. కానీ సొసైటీ సిబ్బంది తమ ఇష్టం వారికి ఒక్కొక్కరికి 10 బస్తాల చొప్పున ఇస్తూ మిగతా వారికి ఒక్క బస్తా కూడా ఇవ్వడం లేదని ఆగ్రహించి మేళ్లచెరువు– కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అక్కడకు చేరుకొని వారికి సర్దిచెప్పి రాస్తారోకో విరమింపజేశారు.

ఎంజీ యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపిక

కోదాడ : పట్టణంలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏడుగురు విద్యార్థులు మహాత్మాగాంధీ యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 17న యూనివర్సిటీలో యూనివర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహించగా కేఆర్‌ఆర్ కళాశాలకు చెందిన కె.అజిత్ (బీఏ సెకండియర్), ఏ.నవీన్ (బీఏ ఫస్టియర్), డి.అనిల్(బీఎస్సీ ఫస్టియర్), ఎం.గురుమూర్తి (బీఎస్సీ ఫస్టియర్), ఎం.మహేష్‌బాబు (బీఎస్సీ– ఫస్టియర్), ఎం.నాగరాజు (బీఏ సెకండియర్)తో పాటు యూనివర్సిటీ మహిళా కబడ్డీ జట్టుకు జి.శ్రీజ ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అక్టోబర్ 4వ తేదీ నుంచి కర్ణాటకలోని బెహల్గాంలో గల రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్టు తరఫున కబడ్డీ జట్టులో పాల్గొంటారు. యూనివర్సిటీ జట్టుకు ఎంపికైన విద్యార్థులను గురువారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ హాదసరాణి అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పీడీ పి.ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, కబడ్డీ కోచ్ నామా నరసింహారావు, అధ్యాపకులు డాక్టర్ సైదిరెడ్డి, ఎస్‌ఎం.రఫీ, యాదమ్మ పాల్గొన్నారు.



కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థులు

బీసీ సేన జాతీయ కార్యదర్శిగా రుక్కారావు

మునగాల : బీసీ సేన జాతీయ కార్యదర్శిగా మునగాల మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త డాక్టర్ నరాల రుక్కారావు నియమితులయ్యారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రుక్కారావు మాట్లాడుతూ.. గ్రామగ్రామాన కమిటీలు ఏర్పాటు చేసి బీసీ సంఘం బలోపేతానికి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బీసీ యువనేత డాక్టర్ రాగ్యా అరుణకుమార్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్‌కు రుక్కారావు కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న రుక్కారావు

ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని తెలిపారు. గ్రూప్– 1 ఫలితాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనడం అవివేకం



ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

హుజూర్‌నగర్ : రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని అనడం అవివేకమని లంబాడీ జేఏసీ నాయకులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో లంబాడీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తీసివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ నెల 26న నియోజకవర్గ వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నగేష్ రాథోడ్, వెంకట్ రామ్, నాగరాజు, వెంకటేశ్వర్లు, మధు, నాగు, చంద్రమౌళి, చందు, నరసింహ, రామ్ కోటి, హరికృష్ణ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.